క్లుప్తంగా

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత



బెల్లంకొండ: పిడుగుపాటుతో కుటుంబ పెద్దను కోల్పోయి కొండంత కష్టంలో ఉన్న కుటుంబాన్ని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదుకున్నారు. కొద్దిరోజుల క్రితం బెల్లంకొండ మండలంలోని కందిపాడు గ్రామానికి చెందిన గుడిపూడి సత్యనారాయణ పిడుగుపాటుతో మృతి చెందాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులతో ఉన్న మృతుని భార్య లక్ష్మి ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుంది. ప్రభుత్వం నుంచి రూ.2లక్షలు మంజూరయ్యాయి. శుక్రవారం ఎమ్మెల్యే నంబూరు బాధిత కుటుంబానికి మండల నాయకులతో కలసి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మావెంకటేశ్వరెడ్డి, పార్టీ జిల్లా కమిటీ మెంబర్ చింతారెడ్డి సాయిరెడ్డి, సర్పంచ్ కంభంపాటి పాప, ప్రకాష్, ఎంపీటీసీ రేగులగడ్డ తిరుపతమ్మ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తెనపల్లి: పట్టణంలో 11 కేవీ లైన్‌లో ట్రీ కటింగ్, సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ పీ రవికిరణ్ శుక్రవారం తెలిపారు. పట్టణంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు. విద్యుత్‌కు సంబంధించిన సమస్యలకు సత్తెనపల్లి టౌన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబరు 9494116238 కు ఫోన్ చేయాలన్నారు.

నకరికల్లు: విద్యుత్ లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్‌ల అత్యవసర మరమ్మతుల కోసం మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ బి.నాగసురేష్‌బాబు శుక్రవారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయానికి, పరిశ్రమలకు వినియోగించే 3ఫేజ్ విద్యుత్ సరఫరాను శుక్రవారం రాత్రి 12 గంటల నుంచి శనివారం ఉదయం 8 వరకు సరఫరా చేస్తామన్నారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

13న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

క్రోసూరు: ఈనెల 13వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో టీవీకే రమణ శుక్రవారం తెలిపారు. ఎంపీపీ పి.కోటయ్య అధ్యక్షతన ఉదయం 11.00 గంటలకు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం సమావేశం హాలులో సర్వసభ్యసమావేశం జరుగుతుందని తెలిపారు. మండలంలో వివిధ శాఖల పనితీరుపై సమీక్ష, గ్రామాలలో పనులు గుర్తించటం తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. కావున ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



రాజుపాలెం: మండలంలోని పలు గ్రామాలలో పోలింగ్ బూత్‌లను తహసీల్దారు ఎం.హరిబాబు శుక్రవారం పరిశీలించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టడంతో తహసీల్దారు మండలంలోని గణపవరంలో 151 నుంచి 156 వరకు, బీరవల్లిపాయలో 157, కొత్తూరులో 158 పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నారు. పోలింగ్ కేంద్రాలలో వసతులు సక్రమంగా ఉన్నాయా, లేవా పరిశీలించారు. ఓటర్ల రాకపోకలకు అనుకూలంగా ఉండేటట్లు చూస్తున్నారు. వికలాంగులకు ర్యాంప్‌లు ఏర్పాటు చేయాలని వీఆర్వోలకు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

సచివాలయం... పల్లెకు మకుటం

- పల్లె ముంగిటకే ప్రభుత్వ యంత్రాంగం
- గ్రామీణ ప్రజలకు చేరువైన సేవలు



నూతనంగా నిర్మించిన ధూళిపాళ్ల సచివాలయ భవనం



సత్తెనపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుతో ప్రజలకు పలు రకాల సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. అటు సచివాలయ ఉద్యోగులు, ఇటు వలంటీర్లు ప్రజలకు విస్తృతంగా సేవలందిస్తున్నారు. సత్తెనపల్లి మండలంలో 19 సచివాలయాల ద్వారా 160 మంది సచివాలయ ఉద్యోగులు, 404 మంది వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. పింఛన్, రేషన్ కార్డ్, సదరన్ స్లాట్ బుకింగ్, ఆరోగ్యశ్రీ, వన్ బీ, అడంగల్, భూములు, ఇల్లు రిజిస్ట్రేషన్, జనన, మరణ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు మీ–సేవ కేంద్రాల్లో అందించే సేవలన్నీ సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉన్నాయి.

రూ.7.60 కోట్లతో నూతన భవనాలు ...

సత్తెనపల్లి మండలంలో 19 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటన్నిటికీ నూతన భవనాల నిర్మాణం కోసం ఒక్కో భవనానికి రూ.40 లక్షలు చొప్పున 19 భవనాలకు రూ.7.60 కోట్లు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వీటిలో అబ్బూరు, భృగుబండ, ధూళిపాళ్ల, కంకణాలపల్లి, కట్టమూరు, నందిగామ, పాకాలపాడు, పెద్దమక్కెన, రెంటపాళ్లలో సచివాలయ భవనాలు నిర్మాణాలు పూర్తి చేసుకొని ప్రజలకు పలు రకాల సేవలు అందిస్తున్నాయి. ఫణిదం, కంటెపూడిలో బేస్మెంట్ లెవల్‌లో ఉండగా, మిగిలిన 8 చోట్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. గత ప్రభుత్వ పాలనలో సుదూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలకోర్చి మండల కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారు. ప్రస్తుతం సొంత గ్రామాల్లోనే 50 గృహాలకు అందుబాటులో ఉన్న వలంటీర్ నేరుగా ఇంటి వద్దకు వచ్చి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. ఈ సేవల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



పాకాలపాడు సచివాలయంలో సేవలు పొందుతున్న ప్రజలు

సత్తెనపల్లి మండల సమాచారం

గ్రామ పంచాయతీలు	: 25
శివారు గ్రామాలు	: 04
మండల జనాభా	: 72,675 మంది
కుటుంబాలు	: 26,024
సచివాలయాలు	: 19
మంజూరైన నిధులు	: రూ.7.60 కోట్లు
పూర్తయిన భవనాలు	: 09
వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నవి	: 10
మొత్తం సచివాలయ ఉద్యోగులు	: 160 మంది
మొత్తం వలంటీర్లు	: 404 మంది

ప్రదక్షిణలు తప్పాయి...



ఆదాయ, కుల, ధ్రువీకరణ పత్రాల కోసం గత ప్రభుత్వ హయాంలో మండల కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగేవాళ్లం. జగనన్న ప్రభుత్వంలో పల్లె ముంగిటకే అన్ని సేవలు అందుతున్నాయి. దీంతో మాకు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసే పని తప్పింది. ప్రభుత్వ పథకాలను పొందడం కోసం అర్హులందరూ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం కలిగింది.

– జల్లీ సుధాకర్, పెద్దమక్కెన, సత్తెనపల్లి మండలం

వ్యయ ప్రయాసలు లేవు...



పిల్లలకు జనన, కుల, ఆదాయ తదితర సర్టిఫికెట్లు, రేషన్, ఆధార్ కార్డులు పొందడం కోసం మండల కేంద్రాలకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. అందుబాటులో ఉన్న సచివాలయంలో దరఖాస్తు చేసుకునే అవకాశం కలిగింది. దీంతో వ్యయ ప్రయాసలు లేవు. జగనన్న ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంటూ పేదలకు చాలా మేలు చేస్తుంది.

– బి.అశోక్, కొమెరపూడి, సత్తెనపల్లి మండలం

అందుబాటులో అధికారులు...



సచివాలయాల ఏర్పాటుతో అధికారులు గ్రామంలో అందుబాటులో ఉంటున్నారు. తద్వారా భూ, రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించుకునే అవకాశం కలిగింది. అలాగే ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవడం కూడా సులువయింది. అవసరమైన ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకోవడానికి మండల కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం తప్పింది.

– గోపిదేశి శివయ్య, మాజీ సర్పంచ్, లక్కరాజు గార్లపాడు

పల్లెల్లోనే విస్తృత సేవలు...



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజలకు గ్రామంలోనే ప్రభుత్వ సేవలు విస్తృతంగా అందుతున్నాయి. దీంతో మండల కేంద్రాలకు, అధికారుల చుట్టూ తిరిగే బాధలు తొలగిపోయాయి. అందుబాటులో ఉన్న సచివాలయ సేవలను సద్వినియోగం చేసుకుంటున్నాం. జగనన్న మేలు ఎప్పటికీ మరువలేము.

– గుంటూరు నతానియల్, మాజీ సర్పంచ్, గుడిపూడి

పారదర్శకంగా సేవలు...



సచివాలయాల ద్వారా ఎలాంటి సేవలైనా పారదర్శకంగా పొందవచ్చు. 35 శాఖలకు సంబంధించిన దాదాపు 500 రకాల సేవలు సచివాలయాల ద్వారా పొందే అవకాశం ఉంది. ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టి గ్రామస్థాయిలోనే సేవలు అందించే వెసులుబాటును కల్పించింది. ప్రజలందరూ ఈ సేవలను వినియోగించుకోవాలి.

– ఎస్.జగదీష్, ఎంపీడీవో, సత్తెనపల్లి

కొండవీడు ఫెస్ట్–2024 బ్రోచర్స్ ఆవిష్కరణ



క్రోసూరు: కొండవీడు పర్యాటక కేంద్రాన్ని సందర్శించేందుకు శని ఆదివారాల్లో కొండవీడు ఫెస్ట్ పేరుతో జరుగుతున్న ఉత్సవాల సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో కొండవీడు ఫెస్ట్–2024 బ్రోచర్స్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోటయ్య పాల్గొని మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పర్యాటక కేంద్రంగా కొండవీడు అభివృద్ధికి కృషి చేయగా, ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొండవీడు ప్రాంతం మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కొండవీటి ప్రాంతాన్ని పరిపాలించిన రాజులు, సామంతులు, చక్రవర్తులు, శతాబ్దకాలానికిపైగా పరిపాలించిన అద్దంకి రెడ్డిరాజులు, అన్నింటికీ మించి తెలుగువారి పాలనా వైభవాలను భావితరాలకు చూపడమే ఈ ఉత్సవాల ప్రధాన లక్ష్యంగా జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో టీవీకే రమణ, ఈవోపీఆర్డీ పి.శివరామయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉమాశంకర్, చందు నాగ శేషగిరి, షేక్ ఖాజావలి, షేక్ రమీజ్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

సత్తెనపల్లి: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి, సలహాలు, సూచనలు అందించేందుకు ఈ నెల 10న డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ జి.ఎస్.వి.వి.కుమార్ శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 11.00 గంటల నుంచి 12.00 గంటల వరకు డయల్ యువర్ డీఎం నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రయాణికుల సమస్యలు, మెరుగైన సేవలకు 9959225429 నెంబరుకు ఫోన్ చేసి తమ సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

ముమ్మరంగా అల్బెండజోల్ మాత్రల పంపిణీ

క్రోసూరు: అల్బెండజోల్ మాత్రల వలన విద్యార్థుల ఆరోగ్యం మెరుగవుతుందని, నులిపురుగుల నుంచి రక్షింపబడతారని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ రమాదేవి అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల్లో 19 సంవత్సరాలలోపు పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. క్రోసూరు జెడ్పీ పాఠశాలలో మండల అధ్యక్షుడు పెరుమాళ్ళ కోటయ్యతో కలిసి పీహెచ్‌సీ వైద్యురాలు రమాదేవి మాత్రల పంపిణీలో పాల్గొన్నారు. ఎల్లప్పుడూ మంచి ఆహారం, సురక్షిత నీటిని తాగాలని, గోళ్లను శుభ్రంగా ఉంచుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకూడదని తెలిపారు. ఆరోగ్యవిస్తరణాధికారి శిఖాశ్యాంసన్, ఆరోగ్యసిబ్బంది, పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రోసూరు జెడ్పీ పాఠశాలలో నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న డాక్టర్ రమాదేవి



రామకృష్ణాపురంలో విద్యార్థినికి అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డాక్టర్ సాయితేజారెడ్డి



చంద్రాజుపాలెంలో మాత్రలు మింగిస్తున్న వైద్యులు, సిబ్బంది



లింగాపురం పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల మందులు వేస్తున్న దృశ్యం

అల్బెండజోల్ మాత్రలతో సంపూర్ణ ఆరోగ్యం

సత్తెనపల్లి: వయసుకు అనుగుణంగా అల్బెండజోల్ మాత్రలను తీసుకోవడం ద్వారా విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ఎస్‌పీఎన్ సాయితేజారెడ్డి, డాక్టర్ గౌతమి, యుఎస్ఎల్ కవిత, డాక్టర్ ప్రదీప్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం బాలికల గురుకుల పాఠశాల, నందిగామ జెడ్పీహెచ్ఎస్, గండ్లూరు ఎంపీపీఎస్, పణిదం జెడ్పీహెచ్ఎస్‌లో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీని వారు ప్రారంభించి మాట్లాడారు. నులిపురుగుల వల్ల విద్యార్థుల్లో తీవ్ర అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని, ఆ పురుగులు వృద్ధి కడుపులోనే జరగడం వల్ల పిల్లల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. మండల వ్యాప్తంగా 12 వేల మంది విద్యార్థులకుగాను శుక్రవారం 11,329 మందికి పంపిణీ చేశారు. 64 మంది గర్భిణులకు, స్కూల్‌లో లేని 78 మందికి పంపిణీ చేశారు. ఎంపీహెచ్ఈవో పిట్టల శ్రీనివాసరావు, పీహెచ్ఎన్ జీవీసీకే మీనాక్షమ్మ, హెచ్‌వీలు జే సంపూర్ణ, పీ వరలక్ష్మి, సూపర్‌వైజర్‌లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులున్నారు.

అమరావతిలో నులిపురుగుల మందుల పంపిణీ

అమరావతి: మండల పరిధిలో 14 సంవత్సరాలలోపు పిల్లలకు జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం నులిపురుగుల మందులను పంపిణీ చేస్తున్నట్లు అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివరత్నకుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పాఠశాలల్లో ఉన్న 12,574 మంది పిల్లలకు నులిపురుగులు మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈరోజు 12,342 మంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామని తెలిపారు. అలాగే 61 మంది గర్భిణులకు కూడా పంపిణీ చేశామని తెలిపారు. మిగిలినవారికి కూడా శనివారం పంపిణీ చేస్తామన్నారు. వైద్యాధికారులు, పాఠశాలల ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

7,017 మందికి మాత్రలు పంపిణీ

ముప్పాళ్ళ: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులచే అల్బెండజోల్ మాత్రలు మింగించినట్లు పీహెచ్‌సీ వైద్యులు రమాదేవి శుక్రవారం తెలిపారు. 19 సంవత్సరాలలోపు 8,600 మందికి గాను 7,017 మందికి మాత్రలు అందించామన్నారు. తొండపిలో వైద్యులు జయకృష్ణప్రవీణ్ విద్యార్థులచే మాత్రలు మింగించారు. ఆయా గ్రామాల్లో సీహెచ్‌వో ఆంజనేయులు, సూపర్‌వైజర్లు పీటర్ డేమియన్, జోస్పిన్‌రాణి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

96 శాతం పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు ..

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలోను, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లోను, ప్రైవేటు పాఠశాలల్లోను రెండేళ్ల నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను అందజేశారు. కొండమోడులోని విద్యార్థి కాలేజీలోను, టీఎస్ఆర్ డిగ్రీ కాలేజీలోను పీహెచ్‌సీ వైద్యులు కృష్ణకుమార్, రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో ఎంఈవో మల్లికార్జున శర్మలు విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను అందించారు. మండలంలో 8,293 మంది పిల్లలకు గాను 8,023 మంది పిల్లలచే సిబ్బంది మాత్రలు మింగించినట్లు తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెల్లంకొండలో అల్బెండజోల్ మాత్రల పంపిణీ

బెల్లంకొండ: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని గ్రామాలలో అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యులు కోటేశ్వరరావు తెలిపారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో మాత్రలు అందజేశారు. చంద్రాజుపాలెంలోని జెడ్పీ హైస్కూల్‌లో వైద్యులు కోటేశ్వరరావు చిన్నారులకు మాత్రలను వేశారు. మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులతో మింగించామని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 94.7 శాతం మందికి వేశామన్నారు. మిగిలిన వారికి 16న అందజేస్తామని తెలిపారు. హెచ్‌ఎం జయరామిరెడ్డి, పీహెచ్ఎన్ రాణి, హెచ్‌వి బేగం, సూపర్‌వైజర్ బాషా, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటెపూడిలో రీ సర్వే స్టోన్ ప్లాంటేషన్ డ్రైవ్



సత్తెనపల్లి: రీ సర్వే ప్రక్రియ పూర్తి చేసుకున్న గ్రామాల్లో శుక్రవారం స్టోన్ ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా సత్తెనపల్లి మండలం కంటెపూడి గ్రామంలో నిర్వహించిన స్టోన్ ప్లాంటేషన్ డ్రైవ్‌ను సత్తెనపల్లి ఆర్డీవో వి.మురళీకృష్ణ పరిశీలించారు. రీ సర్వే ప్రకారం ఏ మాత్రం తేడా లేకుండా నిర్ధారించిన కొలతల ప్రకారం స్టోన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే విజయ్‌కుమార్, వీఆర్వో ఘన్ షైద్, సర్వేయర్, రైతులు ఉన్నారు.

రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సత్తెనపల్లి ఆర్డీవో వి.మురళీకృష్ణ చెప్పారు. మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో మెగాస్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన హద్దురాళ్లను శుక్రవారం పరిశీలించారు. మీ భూమి మా హామీ కార్యక్రమంలో భాగంగా మండలంలో రెండు గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తయిందని, మరో రెండు గ్రామాల్లో హద్దురాళ్లు ఏర్పాటు జరుగుతుందన్నారు. మిగిలిన గ్రామాల్లోను రీసర్వే ప్రక్రియ ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, ఆర్ఐ పవన్‌కుమార్, మండల సర్వేయర్ శ్రీకాంత్, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా ఐజాక్



అమరావతి: మండల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నూతన కమిటీ ఎంపికను స్థానిక శ్రీరామకృష్ణ హిందూస్కూల్‌లో శుక్రవారం ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు నిర్వహించారు. నూతనంగా ఎంపికైన కార్యవర్గంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా ఎస్.ఐజాక్, ప్రధాన కార్యదర్శి గాడి మరియదాసు, కోశాధికారిగా పి.మోహన్ నాయుడు ఎంపికైనట్లు పెదబాబు ప్రకటించారు. కార్యదర్శులుగా ఎంవీ పద్మకుమార్, సీహెచ్ అనీల్‌కుమార్, వి.సాంబ శివరావు, కె.రుస్తుంసింగ్‌లు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ సభ్యులు పాల్గొన్నారు.

సురక్ష శిబిరంలో 354 మందికి వైద్య సేవలు



నందిగామలో పరీక్షలు చేయించుకుంటున్న రోగులు

సత్తెనపల్లి: మండలంలోని నందిగామ గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహించారు. 354 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 168 మంది మహిళలు, 186 మంది పురుషులు ఉన్నారు. గర్భిణులు, బాలింతలు ఏడుగురికి, పాఠశాల విద్యార్థులు 8 మందికి వైద్య సేవలు అందించారు. ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు. శిబిరంలో డాక్టర్ పి.గౌతమి, డాక్టర్ ఎ.సుష్మ, డాక్టర్ రవిశంకర్ రెడ్డిలు వైద్య పరీక్షలు నిర్వహించగా జి.గ్రేస్ కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందరికీ అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో పిట్టల శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సురక్ష శిబిరం 369 మందికి వైద్యపరీక్షలు

ఎర్రబాలెం(క్రోసూరు): మండలంలోని ఎర్రబాలెం (సచివాలయం–3) గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించటం జరిగింది. ఈ వైద్య శిబిరంలో గుంటూరు స్పెషలిస్టు వైద్యులు డాక్టర్ విద్య, డాక్టర్ రాజేష్, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బాలఅంకమ్మబాయి వైద్య పరీక్షలు చేశారు. 369 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు. శిబిరాన్ని క్రోసూరు సర్పంచ్ మల్లా చందమామ, ఎంపీపీ పి.కోటయ్య, ఎంపీడీవో టీవీకే రమణ, ఈవోపీఆర్డీ పి.శివరామయ్య, పంచాయతీ కార్యదర్శి ఉమాశంకర్, నాగశేషగిరి, షేక్ ఖాజావలి, రమీజ్ సందర్శించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న హర్షణీయం



పట్టణంలో పీవీ నరసింహారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ ఐక్యవేదిక నాయకులు

సత్తెనపల్లి: యావత్ భారతదేశం గర్వించదగ్గ మహానాయకుడు, బ్రాహ్మణ ముద్దుబిడ్డ, తెలుగు జాతి ఆణిముత్యం, భారత ఆర్థిక సంస్కరణల పితామహుడు, భారత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న బిరుదు ప్రకటించడం అత్యంత ఆనందదాయకమని బ్రాహ్మణ ఐక్యవేదిక సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షుడు పెద్దింటి ఫణికృష్ణ అన్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో గల మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫణికృష్ణ మాట్లాడుతూ పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు డాక్టర్ గుండ్లపల్లి శ్రీధర్, సత్తెనపల్లి డివిజన్ సెక్రటరీ కొడవటిగంటి నాగ పార్వతయ్య, కోశాధికారి అంపిరాయని రాజశేఖర్, బ్రాహ్మణ సంఘ నాయకులు బెల్లంకొండ నరసింహారావు, వేదాంతం తేజ, గుండవరపు అమర్నాథ్, మామిళ్ళపల్లి బాలధ్రువకుమార్, వేదాంతం రామకృష్ణాచార్యులు, మోతే పురుషోత్తం శర్మ, కోనంకి మారుతి, మంచికంటి వెంకటేశ్వరరావు, విజయరామారావు, రాజశేఖర్, సాధు శివప్రసాద్, నారాయణం లక్ష్మీనారాయణ, విశ్వనాథతులసి, కృష్ణభట్టార్, సంపత్ కుమార్, తదితరులున్నారు.

పీవీ నరసింహారావుకు భారతరత్నపై హర్షం

అమరావతి: భారతదేశ మాజీ ప్రధాని, బహుభాషాకోవిదుడు, తెలుగువాడు పి.వి.నరసింహారావుకు భారత ప్రభుత్వం అత్యున్నత పురస్కారమైన భారతరత్న ఇవ్వటంపై బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ బ్రాహ్మణ సమాఖ్య దక్షిణప్రాంత మాజీ ఉపాధ్యక్షుడు పీసపాటి నాగేశ్వర శర్మ మాట్లాడుతూ అపరచాణక్యుడు, దివాలాతీసిన భారత ఆర్థిక రంగాన్ని పరిపుష్టం చేసిన రాజనీతిజ్ఞుడు పి.వి.నరసింహారావుకు ఆలస్యంగానైనా అత్యున్నత పురస్కారం ఇచ్చి గౌరవించటంపై భారత ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఆదిత్య బ్రాహ్మణ సంఘ సభ్యులు జంపని మారుతీవరప్రసాద్, వారణాశి దిలీప్‌కుమార్ శర్మ, పరాశరం రామకృష్ణమాచార్యులు, కైతేపల్లి సత్యశ్రీ శర్మ, గోళ్లమూడి సుధీర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.